ఉక్కు సంకల్పంతో ప్రజాగర్జన



గంగవరంలో పాదయాత్ర చేస్తున్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాల్లో భాగంగా ఈ నెల 30న ఉక్కునగరం తృష్ణా మైదానంలో నిర్వహించనున్న ఉక్కు ప్రజా గర్జనను విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. గర్జన సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం ఉదయం గంగవరంలో, సాయంత్రం నడుపూరు రామాలయం నుంచి మహా పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ఎలా ప్రైవేటుపరం చేస్తారని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ కోసం ఎంతోమంది ఇళ్లు, భూములు ఇచ్చారని, వారి త్యాగాలను వృథా కానీయమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఉక్కు సంకల్పంతో చేపట్టిన ప్రజా గర్జనకు నిర్వాసితులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మి కులు, కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రజా గర్జనతో కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామన్నారు. 710 రోజులుగా ఉద్యమాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. అనంతరం విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో ఉక్కు పోరాట కమిటీ నాయకులు, అఖిల పక్ష యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

ఆ హక్కు కేంద్రానికి లేదు..



710వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: సంపదను సృష్టించలేని కేంద్ర ప్రభుత్వానికి దేశసంపదను అమ్మే హక్కు లేదని, విశాఖ ఉక్కు దేశ ప్రజల ఆస్తి అని, దానిని ప్రైవేట్ వ్యక్తుల చేతిలోకి పోనివ్వకుండా కాపాడుకుంటామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం 710వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో వైఎస్సార్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మికులు దీక్షా శిబిరంలో కూర్చొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి యూనియన్ నాయకులు దశమంతుల ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, బోర, కర్రి దళినాయుడ, శశిభూషన్‌రావు, నమ్మి రమణ, పిట్టా రెడ్డి, వై.టి. దాసు. డి.వి.రమణ, పి.శ్రీనివాస్, నందికి తాతారావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణ కుట్రలో భాగంగా యాజమాన్యం ఉక్కు ఉత్పత్తులు తయారీకి కావలసిన రా మెటీరియల్స్‌ను సమకూర్చడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రోజుకో విభాగాల్లో ఉత్పత్తిని నిలిపివేస్తూ కొన్ని విభాగాలను ప్రైవేటు వారికి కట్టబెట్టాలని ప్రయత్నించడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరు మారాలని, ప్రజా ఉద్యమాలకు ఎంత పెద్ద నియంతైన తల వంచక తప్పదన్నారు. 30 ఏళ్లుగా సొంత గనులు లేకపోయినా వేల కోట్లు లాభాలను చేకూర్చడమే కాక ఎన్నో కష్టాలను అధిగమించి అంకితభావంతో ఉద్యోగులు ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచితే నేడున్న యాజమాన్యాలు తిరోగమన దిశగా ఉత్పత్తిని తగ్గించుకుంటూ సంస్థను నష్టాల బారిన పడేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరును మార్చుకుని స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న ఉక్కునగరంలో నిర్వహించనున్న ఉక్కు ప్రజాగర్జనకు కార్మికులు, వారి కుటుబసభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ఢిల్లీ పెద్దలు భీతిల్లే విధంగా విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదాలతో మార్మోగాలని కోరారు. కార్యక్రమంలో దాసరి పిల్లారావు, పి.పి.రమణమూర్తి, డి.పి.వెంకటరమణ, చట్టి నర్సింగరావు, డి.దినేష్, కె.మన్మథరావు, ఎస్.భాస్కరరావు, జె.సన్యాసమ్మ, ఎమ్. శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: మై మదర్ విజనరీ ఆధ్వర్యంలో సినీ నటుడు ప్రసన్న కుమార్ ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ప్రముఖ కంటి వైద్య నిపుణుల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. అనంతరం వైద్యులు 700 మందికి కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైనవారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ మాట్లాడుతూ తన తల్లి జ్ఞాపకార్థం ఈ శిబిరం ఏర్పాటు చేశామని, అవసరమైనవారికి కళ్లజోళ్లను కూడా ఉచితంగా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ విశ్వామిత్ర, కల్యాణ్, జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాస్త్రి, డీసీఎంఎస్ చైర్ పర్సన్ పల్లా చినతల్లి, వివిధ సంస్థల ప్రతినిధులు మంత్రి రాజశేఖర్, ఎస్.శ్రీనివాస్, తంగప్పన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి విశాఖ ఉక్కు కీలకం



ఉక్కు నిర్వాసితులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: రాష్ట్ర అభివృద్ధి విశాఖ ఉక్కు పరిశ్రమే అత్యంత కీలకమని, విశాఖ ఉక్కు పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎట్టిపరిస్థితులోనూ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్‌పరం కానివ్వమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో గల వడ్లపూడి మీసేవా గ్రౌండ్స్‌లో ఆదివారం ఉక్కు కార్మికులకు, ప్లాంట్‌కు భూములు ఇచ్చిన ఉక్కు నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ 12 గంటల నిరాహారా దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలో గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి, పలువురు కార్మిక నేతలు, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, ఉక్కు నిర్వాసితులకు న్యాయం చేయాలని, అలాగే మిగిలిన భూములను నిర్వాసితులకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఆదినారాయణ, అయోధ్యరామ్, దామోదర్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కోమటి శ్రీనివాసరావు, ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, ఇతర నాయకులు, నిర్వాసితులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష



విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో కానిస్టేబుల్ రాత పరీక్షలకు హాజరైన అభ్యర్థులు

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. విజ్ఞాన్ కళాశాలలో 18 వందల మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1,618 మంది హాజరయ్యారు. వీరిలో పురుషులు 1,242 మంది కాగా మహిళలు 3,76 మంది ఉన్నారు.

సీఐటీయూ కేంద్ర కమిటీకి అభినందనలు

అక్కిరెడ్డిపాలెం: సీఐటీయూ కేంద్ర కమిటీ నూతన కార్యవర్గానికి భెల్ (హెచ్‌పీవీపీ) విశాఖపట్నం యూనిట్ సీఐటీయూ నాయకులు ఆదివారం సంస్థలో జరిగిన సమావేశంలో అభినందనలు తెలిపారు. బెంగళూరులో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు సీఐటీయూ జాతీయ 17వ మహా సభలు జరిగాయి. జరిగిన సభలో సీఐటీయూ నూతన కేంద్ర కమిటీను ఎన్నుకొన్నారు.అధ్యక్షులుగా కె.హేమలత, ప్రధాన కార్యదర్శిగా తపన్‌సేన్, కోశాధికారిగా ఎం.సాయిబాబుతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకొన్నట్లు భెల్ (హెచ్‌పీవీపీ) సిటు ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ తెలిపారు. వీరి నాయకత్వంలో దేశవ్యాప్తంగా కేంద్రం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసనలు తెలుపుతామన్నారు. నూతన కేంద్ర కమిటీకు అభినందనలు తెలిపిన వారిలో కె.విజయ్ కుమార్, ఎస్.జగన్నాథరావు, పి.కనకారావు, బి.కృష్ణమూర్తి, బి.లక్ష్మణరావు, ఆర్.జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి అనాథాశ్రమానికి బియ్యం వితరణ



అనాథాశ్రమానికి బియ్యం బస్తాలను అందజేస్తున్న దృశ్యం

గాజువాక: అమెరికాకు చెందిన తెలుగు అసోసియేషన్ ఆఫ్ అర్కాన్సెస్ (తా) ఆధ్వర్యంలో స్థానిక స్ఫూర్తి అనాథాశ్రమ చిన్నారులకు బియ్యం పంపిణీ చేశారు. మూడు నెలలకు సరిపడా సమకూర్చిన బియ్యాన్ని ఆ అసోసియేషన్ భారత ప్రతినిధి గొందేశి సుధీర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతులమీదుగా ఆశ్రమానికి అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సేవలను ఎమ్మెల్యే అభినందించారు. తాము ప్రతినెలా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని సుధీర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అనాథాశ్రమం నిర్వాహకుడు రాకేశ్ పాల్గొన్నారు.

పాత గాజువాకలో బీజేపీ జెండా ఆవిష్కరణ



జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీ మనోజ్ తివారి

గాజువాక: పాతగాజువాకం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన జెండాను ఢిల్లీ ఎంపీ, సినీ గాయకుడు మనోజ్ తివారీ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ బలమైన శక్తిగా ఉందన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు, గాజువాక కో ఆర్డినేటర్ కరణం రెడ్డి నర్సింగరావు, నాయకులు బాటా శ్రీనివాస్, నాగేశ్వరరావు, భువనేశ్వరి, రమణ, రోహిణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలపాటు మహిళలకు శిక్షణ



అక్కిరెడ్డిపాలెంలో కుట్టు శిక్షణకు ఎంపికైన మహిళలతో రోటరీ ఫౌండేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: వృత్తి విద్యా శిక్షణలో భాగంగా రోటరీ ఫౌండేషన్ ద్వారా నిరుపేద మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు రోటరీ పూర్వ గవర్నర్ ఎం.జగదీశ్వరరావు తెలిపారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం శిక్షణకు ఎంపికైన మహిళలతో సమావేశమయ్యారు. రోటరీ ఫౌండేషన్ గ్లోబెల్ గ్రాంట్ ద్వారా జిల్లాలో 6 సెంటర్లలలో 13 షిఫ్టలలో 261 మంది నిరుపేద మహిళలకు 3 నెలల పాటు జనశిక్షణా సంస్థాన్ ప్రతినిధులతో కుట్టు పనిలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం మోటార్‌తో కూడిన కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనశిక్షణా సంస్థాన్ సహాయక ప్రోగ్రాం అధికారి చంద్రశేఖర్, శిక్షకురాలు ఆడారి జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సమితి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ సేవ కార్యక్రమం నిర్వహించారు. రాబోయే సత్యసాయి 100వ జయంతి సందర్భంగా స్టీల్‌ప్లాంట మెయిన్ గేటు సమీప నమ్మిదొడ్డిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సత్యసాయి వైద్య విభాగం జిల్లా కన్వీనర్ డాక్టర్ జి.వి.ఎస్. రావు శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 350 మంది రోగులను పరీక్షించి వారికి ఈసీజీ, బీపీ తదితర పరీక్షలు చేశారు. అనంతరం రోగులకు మందులు అందజేశారు. విశాఖ కంటి ఆస్పత్రి ట్రస్టు సభ్యులు కంటి పరీక్షలు చేశారు. శస్త్ర చికిత్స, తదుపరి పరీక్షల కోసం నగరంలోని గాయత్రి ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ సందర్భంగా అక్కడి ప్రభుత్వ పాఠశాల, ఆలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి. రామకృష్ణ, ఉక్కు జనరల్ ఆస్పత్రి మాజీ జీఎం డాక్టర్ నాగేశ్వరరావు, హోమీబాబా ఆస్పత్రి వైద్యులు శివానీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అమర్‌కు శుభాకాంక్షల వెల్లువ



మంత్రి అమర్‌నాథ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నాయకులు



మంత్రి అమర్‌నాథ్‌కు ఆశీర్వచనాలు అందజేస్తున్న వేదపండితులు

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు స్వగ్రామం 68వ వార్డు మిందిలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం మంత్రి అమర్‌నాథ్‌కు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి నివాసం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గుడివాడ అభిమానులతో నిండిపోయింది. ముస్లింసంఘం నాయకులు సయ్యద్ హుస్సేన్, విశాఖ నగర కాంగ్రెస్ కార్యదర్శి గుడివాడ శ్రీనివాస్‌తో పలువురు నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

గాజువాక: రాష్ట్ర ఐటీ శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు గాజువాక వైఎస్సార్‌సీపీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మంత్రిని కలిసి శాలువాతో సత్కరించారు. శుభాకాంక్షలు తెలిపినవారిలో నాయకులు మార్పుపూడి పరదేశి, రాజాన వెంకటరావు, ధర్మాల శ్రీను, బోగాది సన్యాసిరావు, గొందేశి శ్రీనివాసరెడ్డి, ములకలపల్లి వెంకటేష్, వారాది వెంకటరావు, పిట్టా రెడ్డి తదితరులున్నారు.



మంత్రి అమర్‌నాథ్‌కు శుభాకాంక్షలు చెప్పి ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మతపెద్దలు



అమర్‌నాథ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గాజువాక వైఎస్సార్‌సీపీ నాయకులు

ఘనంగా దానప్పతల్లి తీర్థ మహోత్సవం



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి కాలనీలోని దుగ్గపువానిపాలెం గ్రామంలో వెలసిన శ్రీ దానప్పతల్లి అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలందరు వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకుని పసుపు–కుంకుమ, చీర, సారె సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం అలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. కార్యక్రమంలో సరకా కొండలరావు, దానయ్య, డీవీ అప్పారావు, ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, దుగ్గపు దానప్పలు, బొడ్డ సన్యాసిరావు, అప్పలసత్యం, బొడ్డ సన్యాసిరావు, గ్రామ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీపీఐ పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

గాజువాక: సీపీఐ పోరుబాట కార్యక్రమంలో భాగంగా వచ్చేనెల 22న విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నా పోస్టర్‌ను ఆ పార్టీ గాజువాక నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎ.జె.స్టాలిన్ మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణంలో జాప్యం లేకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల భూమి ఇవ్వాలన్నారు. మహాధర్నాపై ఈనెల 30వ తేదీ వరకు ప్రచారం, ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ గాజువాక కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, అప్పారి విష్ణుమూర్తి, కె.పోతన్న, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామమందిర నిర్మాణం హిందువుల కల

ఉక్కునగరం: అయోధ్యలో నిర్మాణమవుతున్న రామ మందిరం నిర్మాణం హిందువుల 500 ఏళ్ల నాటి కల అని బీజేపీ గాజువాక నియోజకవర్గ కోఆర్డినేటర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. స్థానిక అంబేడ్కర్ కళాక్షేత్రంలో జరుగుతున్న విశ్వ హిందూ పరిషత్ ఉత్తరాంధ్ర ప్రాంత సమావేశాల్లో ఆయన మాట్లాడారు. నిర్మాణంలో ఉన్న రామమందిరాన్ని వచ్చే ఏడాదిలో భక్తులు దర్శించుకునే అవకాశం ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రామ మందిరం నిర్మాణం విశ్వహిందూ పరిషత్, దేశ ప్రధాని నరేంద్ర మోదీ చొరవతో సాధ్యమవుతుందన్నారు. ఉక్కు డైరెక్టర్ వేణుగోపాలరావు , వబిలిశెట్టి వెంకటేశ్వర్లు, కేంద్ర కార్యదర్శి గుమ్మల సత్యం, ప్రాంత కార్యదర్శి టి.ఎస్. రవి కుమార్, ఉపాధ్యక్షులు పి.వి.ఎస్. నాయుడుతో వివిధ ప్రాంతాలకు చెందిన విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల మానవత్వం



తల్లి వద్దకు చేరిన దూడ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఆపదలో ఉన్న ఆవు దూడను రక్షించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. స్టీల్‌ప్లాంట్ తారు డిస్టిలేషన్ ప్లాంట్‌లో అటుగా మేత కోసం వెళ్లిన ఆవు దూడ చిక్కుకున్నాయి. తారు మడ్డులో ఇరుక్కున్న దూడ బయటకు రాలేక అరుస్తుండటం అటుగా వెళ్తున్న ఉద్యోగులు చూశారు. వెంటనే సీఐఎస్ఎఫ్ ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి ఉద్యోగుల సాయంతో సుమారు 2 గంటలు కష్టపడి దూడను అక్కడ నుంచి బయటకు లాగారు. దూడ శరీరానికి అంటుకున్న తారును తొలగేలా సపర్యలు చేశారు. తర్వాత దూడను అక్కడకు దగ్గరలో ఉన్న తల్లి వద్దకు చేర్చారు. తారు ప్లాంట్ వద్ద నిత్యం జరుగుతున్న ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రక్షణ గోడ నిర్మించాలని స్టీల్ ఏఐటీయూసీ నాయకులు ఎల్లేటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

కళ్లను సంరక్షించుకోవాలి



అక్కిరెడ్డిపాలెంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: కళ్ల సంరక్షణలో ఎప్పటికప్పుడు జాగ్రత్తలను తీసుకోవాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆదివారం 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం రామాలయం ఎదురుగా గల కమ్యూనిటీ హాలులో వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు, మన ఐ కేర్ (ప్రైమరీ ఐ కేర్ సర్వీస్) ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 250 మందికి పరీక్షలు నర్విహించారు. కార్యక్రమంలో వైద్యుడు ఎం.వినయ్ దినకరన్, వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్ , వరదాడ వెంకటరమణ, నేలపాటి సత్యవతి, నేలపాటి శ్యాంబాబు, బోనెల జోసెఫ్, నంబారు రాజు, మార్కెటింగ్ కమిటీ చైర్మెన్ పల్లా చినతల్లి, కంటి వైద్యులు ఎం.సౌమ్య, ఎం.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

గాజువాక: ఇటీవల నేపాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ – 2023 పోటీల్లో భారత్ తరఫున ప్రతిభ ప్రదర్శించిన విశాఖ క్రీడాకారులను సినీ నటుడు ప్రసన్నకుమార్, బీజేపీ గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు అభినందించారు. ఈ ఏడాది మే 27, 28 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న ఇండో నేపాల్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ బ్రోచర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం నర్సింగరావు మాట్లాడుతూ అంతర్జాతీయ పోటీలకు విశాఖ నుంచి హాజరైన క్రీడాకారులు ఎనిమిది స్వర్ణ పతకాలు, ఆరు రజిత పతకాలు, ఆరు కాంస్య పతకాలను సాధించారన్నారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం రెండవ స్థానం లభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోచ్ సీహెచ్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్ర యాత్రను జయప్రదం చేయాలి

గాజువాక: రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్రకు కొనసాగింపుగా ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు చేపట్టనున్న ప్రజాక్షేత్ర యాత్రను జయప్రదం చేయాలని పీసీసీ ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు కోరారు. పాత గాజువాక జంక్షన్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహంవద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుద్రరాజు ప్రజాక్షేత్ర యాత్ర ఈనెల 26 నుంచి విశాఖలో ప్రారంభం కానుందన్నారు. ఈ యాత్రలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గవర వెంకట రమణారావు, స్వర్ణ, ఉరుకూటి అచ్చిబాబు, దొమ్మేటి రమణారావు, ఎం.వర్మ, ఎరబాల భూలోక, రంజితా రెడ్డి, కొవిరి దేవుడు, చిట్టి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నేడు వాసవీ కన్యకాపరమేశ్వరి మహోత్సవం

పెదగంట్యాడ: మండలంలోని హెచ్‌బీ కాలనీ శివారులోని వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన ఆలయంలో అమ్మవారి ఆత్మాహుతి మహోత్సవాలను సోమవారం నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు ముత్యాలశెట్టి, త్రిమూర్తులు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 5.30 గంటలకు నవామృతాభిషేకం, మండపారాధన ఉంటాయన్నారు. అలాగే మహాగణపతి, లక్ష్మీగణపతి, మహాలక్ష్మి, వాసవీ మూలమంత్ర హోమాలు, పూర్ణాహుతి, మహిళలతో కుంకుమార్చనలు చేయించనున్నామని వివరించారు. సాయంత్రం 6 గంటలకు ఊరేగింపు ఉంటుందన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నితీష్ కుమార్ రెడ్డికి అభినందనలు



నితీష్ కుమార్ రెడ్డికి అభినందనలు తెలుపుతున్న బీహెచ్‌పీవీ ఫ్రెండ్స్ క్లబ్ అసోసియేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంకు చెందిన కాకి ముత్యాల రెడ్డి కుమారుడు కాకి నితీష్ కుమార్ రెడ్డి ఐపీఎల్ క్రికెట్‌లో సెలక్ట్ అయిన సందర్భంగా బీహెచ్‌పీవీ ఫ్రెండ్స్ క్లబ్ ప్రతినిధులు ఆదివారం ఆయన నివాసంలో అభినందనలు తెలిపారు. నితీష్ కుమార్ రెడ్డి ఐపీఎల్‌లో హైదరాబాద్ సన్‌రైజ్ జట్టుకు ఎన్నికవ్వడం ఆనందదాయకమ న్నారు. ఐపీఎల్‌లో రాణించి భారతదేశ జట్టులో స్థానం సంపాదించి తమ గ్రామానికి ఖ్యాతిని తేవాలని అసోసియేషన్ ప్రతినిధులు ఆకాంక్షించారు.